సిగరెట్ తాగవద్దన్నందుకు ఇనుప రాడ్డుతో దాడి

మోతీనగర్: సిగరెట్ సేవిస్తే వాసన వస్తుందని, ఇక్కడ తాగవద్దన్నందుకు ఓ వ్యక్తిపై దాడి చేసిన సంఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ సామల వెంకటరెడ్డి వివరాల ప్రకారం.. అల్లాపూర్ డివిజన్ వివేకానందనగర్ నుంచి పర్వత్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో రంగయ్య చికెన్ షాపును నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో సయ్యద్ షామిద్ షాపు ముందు సిగరెట్ తాగుతున్నాడు. స్మోకింగ్ వల్ల కొనుగోలుదారులు ఇబ్బంది పడతారని చికెన్ షాపు యజమాని సయ్యద్‌కు చెప్పాడు. దీంతో నన్నే సిగరెట్ తాగొద్దంటావా? అని వెళ్లిపోయిన సయ్యద్ తిరిగి రాత్రి 8.45 గంటలకు తన సోదరుడు, ఇద్దరు మిత్రులను తీసుకువచ్చి గొడవకు దిగాడు. సయ్యద్ షామిద్ ఓ ఇనుప రాడ్డుతో దాడి చేయటంతో రంగయ్య గౌడ్ తలకు గాయాలయ్యాయి. సయ్యద్ షాహిద్‌పై గతంలో సనత్ నగర్‌లో ఒక కేసు, అల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో మరో కేసు నమోదైందని సీఐ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరం

నిజాంపేట్: 4వ డివిజన్‌లో శనివారం జి.సురేంద్ర కుమార్‌యాదవ్ మిత్ర బృందం ఆధ్వర్యంలో శనివారం ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, కొలన్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో యుగంధర్‌రెడ్డి, సుబ్బు, శివ, వెంకట్రావ్, చంద్ర, పవన్, మహమూద్, మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల మధ్యే .. గ్యాస్ అక్రమ ఫిల్లింగ్ స్టేషన్‌లు!

పొంచి ఉన్న ప్రమాదం | ఆందోళన చెందుతున్న స్థానికులు | పట్టించుకోని అధికారులు



ఫిల్లింగ్ సమయంలో గ్యాస్ పేలి ధ్వంసమైన బాగ్‌అమీర్‌లోని దుకాణం

కూకట్‌పల్లి: నియోజకవర్గంలో గ్యాస్ అక్రమ ఫిల్లింగ్ స్టేషన్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. ఉపాధి కోసం నగరానికి వచ్చే నిరుద్యోగులు కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, బాలానగర్, హైటెక్ సిటీ వంటి ప్రాంతాలకు వచ్చి జీవనోపాధి కోసం తాత్కాలిక నివాసం ఏర్పాటు చేసుకుంటుంటారు. గ్యాస్ కనెక్షన్ తీసుకోవాలంటే సవాలక్ష షరతులు ఉండటంతో తాత్కాలికంగా చిన్న గ్యాస్‌ను కొనుగోలు చేసి వంట చేసుకుంటారు. వారి అవసరాలను అదునుగా చేసుకున్న కొంతమంది అక్రమ వ్యాపారానికి తెగబడుతున్నారు. దీంతో నియోజకవర్గంలో అక్రమ ఫిల్లింగ్ స్టేషన్‌లు విచ్చల విడిగా వెలుస్తున్నాయి. ఒక్క పెద్ద గ్యాస్ సిలిండర్ నుంచి 6,7 చిన్న గ్యాస్ కనెక్షన్లకు నింపుతున్నారు.

ధనార్జనే ధ్యేయంగా..

గృహ సముదాయాల మధ్య ఫిల్లింగ్ స్టేషన్లను ఇష్టానుసారంగా ఏర్పాటు చేస్తున్నారు. పెద్ద గ్యాస్ నుంచి చిన్న గ్యాస్ సిలిండర్ నింపేటప్పుడు ఏ మాత్రం పేలినా చుట్టు పక్కల ఉన్న నివాసితులు, దారిన వెళ్లే వారు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ఇటీవల కాలంలో అవి పేలిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ముఖ్యంగా నిర్వాహకులు ధనార్జనే ధ్యేయంగా నిబంధనలకు విరుద్ధంగా ఈ వ్యవహారాన్ని సాగిస్తున్నారు. అక్రమ ఫిల్లింగ్ స్టేషన్‌లపై ప్రశ్నించిన వారిని పలుకుబడితో లోబరుచుకుంటున్నారని తెలుస్తోంది. గతంలో జింకలవాడ ప్రాంతంలో అక్రమ ఫిల్లింగ్ స్టేషన్ నుంచి సుమారు 400 గ్యాస్ సిలిండర్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల బాగ్‌అమీర్ ప్రాంతంలో జనవాసాల మధ్య ఏర్పాటు చేసిన ఫిల్లింగ్ స్టేషన్‌లో ప్రమాదం జరగటంతో ఫిల్లింగ్ స్టేషన్ పైకప్పు ఎగిరి రోడ్డుపై పడింది. గ్యాస్ నింపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి సుమారు 26 చిన్న గ్యాస్‌లు, 21 పెద్ద గ్యాస్ సిలిండర్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇంత జరుగుతున్నా పౌర సరఫరాల శాఖ ఏ మాత్రం స్పందించకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

టీమ్ ఏర్పాటు చేసి సీజ్ చేస్తాం

కూకట్‌పల్లి ప్రాంతంలో గ్యాస్ ఫిల్లింగ్‌స్టేషన్లు నడుస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. ఫిల్లింగ్ స్టేషన్‌లపై ఒక టీమ్ ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటాం. ఫిల్లింగ్ స్టేషన్‌పై సిబ్బంది ప్రమేయం ఉంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– కల్యాణ్,
బాలానగర్ అసిస్టెంట్ సప్లై అధికారి.

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ కార్పొరేటర్‌లు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి కార్యకర్తలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ పార్టీని మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు గుర్తు చేయాలన్నారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ



లబ్ధిదారులతో ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని 44 మంది లబ్ధిదారులకు రూ.19.15 లక్షల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. ఆ చెక్కులను శనివారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటుందన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ అశోక్ గౌడ్, నాయకులు రఘునాథ్ రెడ్డి, ఆదర్శ్ రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, నాయినేని చంద్రకాంత్‌రావు, సాంబశివరావు, పోతుల రాజేందర్, కాశీనాథ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మసీద్ వద్ద వీధి దీపాలు, స్తంభం ఏర్పాటు



విద్యుత్ స్తంభం ఏర్పాట్లను పరిశీలిస్తున్న సయ్యద్ ఏజాజ్ తదితరులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ లైన్స్ టౌన్ కాలనీలోని సుబానీ మసీద్ వద్ద శనివారం విద్యుత్ స్తంభం, వీధి దీపాలు ఏర్పాటు చేశారు. పనులను బీఆర్‌ఎస్ కూకట్‌పల్లి మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ ఏజాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మసీద్ నిర్వాహకులు ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ దృష్టికి తీసుకెళ్లడంతో, వారు అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నదీం పటేల్, షేక్ షకీల్, మహ్మద్ అబ్దుల్ సలాం తదితరులు పాల్గొన్నారు.

వసూళ్లకు వేళాయే !

పురపాలికలు, జీపీల్లో పన్నుల టార్గెట్ రూ.209.40కోట్లు

- వసూలైన పన్ను రూ.169.66 కోట్లు
- నెలాఖరుకల్లా మిగిలిన పన్ను వసూళ్లపై కసరత్తు
- రోజువారీ మానిటరింగ్‌పై ప్రత్యేక చర్యలు

సాక్షి,సిటీబ్యూరో: నగర శివారు 13 పురపాలక సంఘాలు, 34 గ్రామ పంచాయతీల్లో 2024–25 ఆర్థిక సంవత్సరంలో వివిధ పన్నుల ద్వారా రూ.209.40 కోట్లు లక్ష్యంగా అధికార యంత్రాంగం నిర్ణయించింది. కానీ రూ.169.66 కోట్లు మాత్రమే వసూలైంది. మిగతా పన్నులు రూ.39.74 కోట్లు ఈ నెలాఖరు కల్లా వసూలు చేసేందుకు తగిన కార్యాచరణ ప్రణాళికతో సంబంధిత పురపాలక సంఘాలు, జీపీలు ముందుకు సాగుతున్నాయి. మార్చి నెలాఖరు కల్లా 100 శాతం పన్నులు వసూలు చేయాలన్న లక్ష్యాన్ని పూర్తి చేసేలా రోజువారీ మానిటరింగ్‌పై కసరత్తు చేస్తున్నాయి.

పన్నులు ఇలా..

నగర శివారు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 4 మున్సిపల్ కార్పొరేషన్లు, 9 మున్సిపాలిటీలు ఉండగా.. ఈ పట్టణాల్లో ఇంటిపన్నుతో సహా వివిధ పన్నుల రూపేణా వసూలయ్యే నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టేలా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.



- బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు పోచారం, తూముకుంట, నాగారం, మేడ్చల్, కొంపెల్లి, ఘట్కేసర్, గుండ్లపోచంపల్లి, దమ్మాయిగూడ, దుండిగల్ మున్సిపాలిటీలో వివిధ పన్నుల ద్వారా రూ. 198.45 కోట్లు వసూలు చేయాలని మున్సిపల్ యంత్రాంగం నిర్ణయించినప్పటికీ, రూ.162.09 కోట్లు మాత్రమే వసూలైంది.
- 34 గ్రామ పంచాయతీల్లో 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.10.95 కోట్లు లక్ష్యంగా నిర్దేశించినప్పటికీ, ఇప్పటి వరకు రూ.7.57 కోట్లు వసూలు చేశారు. పట్టణాలు, గ్రామ పంచాయతీల్లో లక్ష్యానికి అనుగుణంగా మిగతా పన్నులను ఈ నెలాఖరు వరకు వసూలు చేయాలని నిర్ణయించారు.

అభివృద్ధి కార్యక్రమాలు.. ఇతర ఖర్చులు

నగర శివారులోని 13 పురపాలక సంఘాలు, 34 గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు నిర్వహణ ఖర్చులు, సిబ్బంది జీత భత్యాలు, కరెంట్ బిల్లులతో సహా ఇతరత్రా ఖర్చులు, బిల్లుల చెల్లింపులకు ప్రధాన ఆదాయ వనరు పన్నులు కావడంతో వాటి వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే జిల్లాలోని పలు గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికులకు మూడు నెలల నుంచి 5 నెలల జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. – పంచాయతీల్లోనే కాకుండా పలు పురపాలక సంఘాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి నిర్వహణ, వీధిలైట్లు, రోడ్ల మరమ్మతులు తదితర కార్యక్రమాల నిర్వహణపనులు కూడా సంబంధిత జీపీలు ,పురపాలక సంఘాలు చూసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం పాలకవర్గాలు లేకపోవటంతో ఆ భారం సంబంధిత ఉద్యోగులపై పడుతోంది. ఈ నేపథ్యంలోనే పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

వృద్ధాశ్రమానికి వాషింగ్ మెషిన్ అందజేత



వాషింగ్‌మెషిన్ అందజేస్తున్న ఉద్యోగులు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ 9వ ఫేజ్‌లోని సహృదయ వృద్ధాశ్రమానికి గచ్చిబౌలిలోని సైబేజ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ సైబేజ్ ఆశ ప్రోగ్రాం ద్వారా 12 కేజీల వాషింగ్ మెషిన్‌ను అందించినట్లు సైబేజ్ కంపెనీ సీనియర్ సీఎస్‌ఆర్ ఎగ్జిక్యూటివ్ అనపురపు సురేష్ తెలిపారు. శనివారం సైబేజ్ కంపెనీ ఉద్యోగులు వృద్ధాశ్రమాన్ని సందర్శించి వృద్ధుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. వారికి పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్, వెంకటేష్, తిరుపతి, ఫణిప్రసాద్, సంతోష్, సాయిప్రసాద్, సాయి మణికంఠ, సుతిక్షన్, అక్షిత, కావ్య, వర్షిత, అర్జున్, కృష్ణ చైతన్య, ఆశ్రమ నిర్వాహకులు యాకుబి, హకీమ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

కూకట్‌పల్లి: డ్రగ్స్ విక్రయిస్తున్న ఓ నైజీరియా వ్యక్తిని, కొనుగోలు చేసేందుకు వచ్చిన మరో వ్యక్తిని కేపీహెచ్‌బీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 13 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. శనివారం పోలీసులు వివరాలు వెల్లడించారు. నైజీరియా దేశానికి చెందిన ఎజాజ్ జోషు(38) 2019లో అంతర్జాతీయ బిజినెస్ వీసా తీసుకుని ముంబై నగరానికి చేరుకున్నాడు. నైజీరియా దేశస్తులతో కలిసి వస్త్ర వ్యాపారం ప్రారంభించాడు. తర్వాత తమ దేశస్తులతో కలిసి డ్రగ్స్ వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నాడు. మరోవైపు హైదరాబాద్ నగరానికి చెందిన గంగిరెడ్డి గారి రోహిత్ యూఎస్ఏలో బీబీఏ చదువుతున్నప్పుడు డ్రగ్స్‌కు బానిసఅయ్యాడు. అనంతరం అతడు ముంబై యాక్టింగ్ స్కూల్‌లో చేరి నైజీరియాకు చెందిన ఎజాజ్ జోషుతో పరిచయం పెరిగి అతడితో కలిసి డ్రగ్స్ సేవించేవాడు. ముంబై నగరంలో అతను డ్రగ్స్ విక్రయిస్తుండగా ఎజాజ్ జోషును పోలీసులు పట్టుకొని జ్యూడీషియల్ రిమాండ్ కు తరలించారు. 2023లో బెయిల్ పై జైలు నుంచి విడుదలైన తర్వాత మరల డ్రగ్స్ వ్యాపారం ప్రారంభించాడు. తదనంతరం రోహిత్ తో ఉన్న పరిచయాన్ని ఉపయోగించుకొని నగరంలో డ్రగ్స్ విక్రయించడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో ఈ నెల 6న రోహిత్... అవైజ్ అనే నకిలీ పేరుతో డాల్ఫిన్ బస్సులో టికెట్లు బుక్ చేయగా... డ్రగ్స్ తీసుకొని ఎజాజ్ జోషు నగరంలోని మియాపూర్ మెట్రో స్టేషన్ కు చేరుకున్నాడు. విశ్వసనీయ సమాచారంతో కేపీహెచ్‌బీ పోలీసులు ఈనెల 7న రాత్రి 11 గంటల ప్రాంతంలో అడ్డగుట్టలోని విశాల్ సొసైటీ వద్దకు చేరుకోగానే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. గంగి రెడ్డి గారి రోహిత్ తో పాటుగా నైజీరియా నుంచి డ్రగ్స్ ను సరఫరా చేస్తున్న ఎజాజ్ జోషు లపై కేసు నమోదు చేశారు. వారి వద్ద 13 గ్రాముల ఎండిఎంఏ డ్రగ్స్, 2 సెల్ ఫోన్లు, రూ. 80 వేల నగదు, కారును స్వాధీనం చేసుకున్నారు.

ఆమెకు వందనం

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

- వివిధ రంగాల్లోని అతివలను సన్మానించిన ప్రజాప్రతినిధులు, నాయకులు

కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే, కార్పొరేటర్‌లు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు. వివిధ వృత్తుల్లో రాణించిన మహిళలను సన్మానించారు. మహిళలకు భూదేవికి ఉన్నంత సహనం ఉంటుందని, అందుకే కుటుంబ భారం, సమాజ భారాన్ని మోయగలిగే శక్తి మహిళలకు ఉంటుందని అన్నారు. మహిళలు మన సమాజంలో ముఖ్య భాగమన్నారు. వారు లేనిదే సమాజం లేదన్నారు. మహిళ బాగుంటేనే ఆ కుటుంబం బాగుంటుందన్నారు.

– కూకట్‌పల్లి జోన్‌బృందం



మాధవరం నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లతో కార్పొరేటర్ రోజాదేవి



ఎల్లమ్మబండ గుడ్‌విల్ హోటల్ వద్ద సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సతీష్‌రావు



కేక్ కట్ చేస్తున్న బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ రవీందర్ రెడ్డి



కేపీహెచ్‌బీకాలనీ ధనలక్ష్మి సెంటర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ..



మహిళలతో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపిన కార్పొరేటర్ సతీష్ గౌడ్



దీన్‌దయాల్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం వద్ద..



బాలానగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహిళలను సన్మానిస్తున్న బండి రమేష్



ఫిరోజ్‌గూడలో నిర్వహించిన వేడుకల్లో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాంతారావు



ఆల్విన్‌కాలనీ బీజేపీ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీలను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు



కూకట్‌పల్లి బస్ డిపోలో .. డిపో మేనేజర్ హరి తదితరులు



ప్రగతి నగర్‌లోని శ్రీ సాయి విద్యానికేతన్‌లో విద్యార్థినుల నృత్య ప్రదర్శన



బాలానగర్ పోలీస్‌స్టేషన్‌లో ..



పారిశుద్ధ్య కార్మికులకు చీరలను పంపిణీ చేస్తున్న మూసాపేట కార్పొరేటర్ మహేందర్



క్యాంప్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



హెచ్‌ఏఎల్‌లో .. రాష్ట్ర ఇంటలిజెన్స్ ఐజీ సుమతి బడుగుల, మాజీ డిప్యూటీ డైరెక్టర్ ఫర్ మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ మల్లవరపు బాలలత తదితరులు